

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

గురువారం
23 మే 2024
పేజీలు 8

ప్రకాశం బాపట్ల


# హ్యాట్రిక్ దిశగా ఎమ్మెల్యే స్వామి

ఒకరు హ్యాట్రిక్ కోసం దూసుకువెళుతుంటే మరోవైపు ప్రత్యర్థి అనుమాన భయంతో పరుగులు తీసే పరిస్థితి.. విపక్షానికి చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యే విజయానికి బాటలు వేసుకుంటూ ముందుకు వెళితే.. అధికారపక్షానికి చెందిన మంత్రి సొంత పార్టీ వర్గీయులనే నమ్మలేని పరిస్థితి.. దీని తోడు మంత్రి ఓటమికి ఆ పార్టీలోనే కొందరు నేతలు తమ సామాజిక వర్గాలతో సమావేశాలు పెట్టి మరీ మంత్రి ఓటమిని కోరారు.. ఫలితంగా నేడు ఆ నియోజకవర్గంలో అధికార పార్టీ అభ్యర్థి హైదరాబాద్‌కు మకాం మార్చివేయడంతో వైకాపాను నమ్ముకున్న క్యాడర్ పరిస్థితి అయోమయంలో పడింది. హ్యాట్రిక్ వైపు పయనిస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని నమ్ముకున్న వారు విజయకేతనం వైపు వెళుతున్నారు.

- ఆదిమూలపు కొంపముంచిన అనుమానం
- సొంతపార్టీ వర్గీయులను నమ్మకపోవడమే ప్రతికూలత
- వైకాపా అధిష్టానం వేసిన ట్రాన్స్‌ఫర్ ప్లాన్ ఫెయిల్
- ఎమ్మెల్యే స్వామికి పట్టం కట్టనున్న కొండపి ప్రజలు
- మంత్రి సురేష్‌కు షాక్ ఇచ్చిన మాల సామాజికవర్గం
- సహకరించని జూపూడి, పలువురు మండల స్థాయి నేతలు

సూర్యప్రతినిధి, ఒంగోలు

సార్వత్రిక ఎన్నికల్లో కొండపి నియోజకవర్గం రికార్డును సృష్టించనుంది. తెలుగుదేశం పార్టీకి చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి మరోసారి విజయకేతనం ఎగురవేయబోతున్నారని నియోజకవర్గం ప్రజలు అంటున్నారు. ఇప్పటికే వరుసగా రెండు సార్లు కొండపి నుంచి గెలుపొందిన స్వామి ఈ ఎన్నికల్లో గెలిస్తే వరుసగా మూడుసార్లు గెలిచిన ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ సంపాదించనున్నారు. ఎమ్మెల్యే స్వామి వరుసగా విజయాలు సాధించకూడదని వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి కొండపిపై గత ఏడాదికాలంగా ప్రత్యేక దృష్టి నిలిపారు. ఇందులో భాగంగా యర్రగొండపాలెంకు చెందిన మంత్రి ఆదిమూలపు సురేష్‌ను కొండపిలో వైకాపా అభ్యర్థిగా బరిలో దించి ఎన్నికల్లో మూడో విజయం ఎమ్మెల్యే స్వామికి దక్కకుండా చేయాలనుకున్న ప్రయత్నాలు ఫలించే పరిస్థితులు కనిపించడం లేదు. గత



దశాబ్ధకాలంగాపైగా ప్రజలతో మమేకమైన ఎమ్మెల్యే స్వామిని మరోసారి పీఠం ఎక్కించేందుకు కొండపి నియోజకవర్గం ప్రజలు సిద్ధమైనట్లు తెలుస్తుంది. ఆదిమూలపు సురేష్‌ను వైకాపా అభ్యర్థిగా బరిలో దింపిన ఆయనకు స్థానిక క్యాడర్ సహకరించకపోవడంతోనే మరోసారి కొండపిలో వైకాపా ఓటమితో సర్దుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## అనుమానమే కొంప ముంచిందా?

కొండపి నియోజకర్గంలో ఎమ్మెల్యే స్వామిని రాజకీయంగా అడ్డుకునేందుకు వైకాపా అధిష్టానం పన్నిన పన్నాగాలు విఫలమైనట్లు స్పష్టమౌతున్నాయి. మంత్రి ఆదిమూలపు సురేష్‌ను అభ్యర్థిగా బరిలో దింపినప్పటికి ఆ ప్రయోగం వికటించినట్లు కనిపిస్తుంది. వైకాపా అభ్యర్థిగా పోటీలో నిలిచిన మంత్రి సురేష్ స్థానికేతరుడు అనే ముద్ర పడటంతో కొండపి ఓటర్లు అతని వైపు ఆసక్తి కనబర్చలేదనేది స్పష్టమౌతుంది. దీనికి తోడు మంత్రి సురేష్ తక్కువ సమయంలో కొండపి బాధ్యతలు నిర్వర్తించాల్సి రావడంతో నియోజకవర్గంలోని వైకాపా క్యాడర్‌ను పూర్తి స్థాయిలో నమ్మకపోవడం, మద్దతు తెలిపిన పార్టీ వర్గీయులు ఆర్దిక ప్రయోజనాల కోసమే తమ వద్దకు వస్తున్నట్లు మంత్రి అనుచరగణం తప్పుడు సంకేతాలు ఇవ్వడంతో క్యాడర్‌ను మంత్రి అనుమానిస్తున్నారనే సంకేతాలు తారాస్థాయికి చేరాయి. ఫలితంగా పార్టీకి చెందిన ముఖ్యులు




8 లో...

## అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు: ఎస్పీ



## చీమకుర్తిలో అంగరంగ వైభవంగా నృసింహ స్వామి జయంతి

వివరాలు 4లో

# పకడ్బందీగా ఓట్ల లెక్కింపు: కలెక్టర్

బాపట్ల, మేజర్‌న్యూస్: ఓట్ల లెక్కింపు ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. ఓట్ల లెక్కింపు కార్యక్రమంపై రిటర్నింగ్ అధికారులు, ఏఆర్‌ఓలకు అవగాహన కార్యక్రమం బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. ఓట్ల లెక్కింపు ప్రక్రియ అత్యంత పారదర్శకంగా సమర్ధతతో నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి చెప్పారు. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమయ్యేలా చూడాలని అధికారులను ఆయన ఆదేశించారు. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఓట్ల లెక్కింపు కేంద్రంలో అన్ని సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. ఈసీఐ సూచించిన మార్గదర్శకాలను విస్మరించరాదన్నారు. పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలకు 12 కౌంటింగ్ హాల్స్, పోస్టల్ బ్యాలెట్ కొరకు మరో రెండు కౌంటింగ్ హాల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలో 14 టేబుల్స్ ఏర్పాటు చేయాలని, ఒక రౌండ్‌లో 14 పోలింగ్ కేంద్రాలలోని ఓట్లు లెక్కించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరాదని హెచ్చరించారు. ఎలక్ట్రానిక్





వస్తువులు సైతం లోపలికి అనుమతించరాదన్నారు. నాలుగు రోజులు ముందుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని వారికి మార్గనిర్దేశం చేశారు.

ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించిన విధి నిర్వహణలో పొరపాట్లు జరగకుండా అధికారులు నిఘా ఉంచాలని జిల్లా ఎన్నికల అధికారి రంజిత్ బాషా అన్నారు. లెక్కింపు కేంద్రంలో గొడవలు జరిగితే కఠిన చర్యలు ఉంటాయని, కేసులు నమోదు చేస్తామనే విషయాన్ని అభ్యర్థులకు తెలపాలన్నారు. ఈనెల 28వ తేదీన ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. 30వ తేదీన ఓట్ల లెక్కింపు సిబ్బందికి శిక్షణలు ఉంటాయన్నారు. మూడో తేదీన రెండో దశ శిక్షణ ఇవ్వాలన్నారు. నిష్ణాతులైన మాస్టర్ ట్రైనర్ల ద్వారా సిబ్బందికి సమర్ధంగా శిక్షణలు నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా ఈటిపిబిఎస్, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కింపు కార్యక్రమంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎన్నికల పరిశీలకులు, పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి ఏజెంట్ల సమక్షంలో పారదర్శకంగా ప్రక్రియ చేపట్టాలని ఆయన పలు సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అవసరమైన సామగ్రి సమకూర్చుకోవాలని ఆర్ ఓ లను జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్ ఆదేశించారు. ఈసీఐ మార్గదర్శకాలు, నిబంధనలపై పిపిటీ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, ఆరోఓలు, ఏఆరోఓలు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఇరిగేషన్ ఎయ్యి భరద్వాజ్ పై ఫిర్యాదు చేసిన బీఎస్పీ



బాపట్ల రూరల్, మేజర్‌న్యూస్: ఆంధ్రప్రదేశ్ బహుజన సమాజ్ పార్టీ బాపట్ల నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి గుదే రాజారావు, బీఎస్పీ పార్లమెంట్ అధ్యక్షుడు కాగిత కోటేశ్వరరావు బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్ సిఐ వై.శ్రీహరి కి నల్లమడ వాగు గట్టున ఉన్న ఇసుకను ట్రాక్టర్లతో తరలిస్తున్న ఇరిగేషన్ ఏఈ భరద్వాజ్ కళ్ళు మూసుకొని పిల్లి పాలు తాగుతూ నన్నెవరూ చూడలేదు అనే విధంగా విధులు నిర్వహిస్తున్నారని వారిపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అర్జీ ఇచ్చారు.బాపట్ల మండలంలోని కప్పల వారి పాలెం పరిధిలో నల్లమడ వాగు సుమారుగా 200 ట్రాక్టర్ల ఇసుకను తీసుకు వెళుతుంటే పట్టించుకోని ఇరిగేషన్ ఏ ఈ భరద్వాజ పై ఫిర్యాదు.ప్రభుత్వ ఉద్యోగి డ్యూటీ నిర్లక్ష్యం చేస్తే ఇండియన్ పీనల్ కోడ్ 1860, సెక్షన్ 166 ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 166 ప్రకారము ఏదైనా ఉద్యోగి తను చేయవలసిన కర్తవ్యాన్ని (డ్యూటీ) చేయ కుండా నిర్లక్ష్యం వహించడం లేదా కావాలని ఉల్లంఘిం చడం ద్వారా ఎవరైనా వ్యక్తి గాని ప్రజలకు గాని పబ్లిక్ ప్రాపర్టీ, ప్రభుత్వ ఆస్తులు నష్టం కలుగ చేస్తే అందుకు బాధ్యులైన ఉద్యోగి పై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దర్యాప్తు చేసి 200 డాక్టర్ల ఇసు కను కొట్టుకు వెళ్ళిన భూ బకాసురులను ఇరిగేషన్ ఏఈ భరద్వాజపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

## బడి ఈడు పిల్లలు పాఠశాలల్లో చేరాలి



వేమూరు(భట్టిప్రోలు) మేజర్‌న్యూస్: ప్రత్యేక అవసరాలు కలిగిన బడి ఈడు పిల్లలందరిని పాఠశాలల్లో చేర్పిం చా లని ఐ ఈ ఆర్ ఎఫ్ విజయలక్ష్మి తెలియ జేశా రు. బుధ వారం మండలంలోని వరహ పురం గ్రామంలో ప్రత్యేక అవసరాలు కలిగియున్న పిల్లలను గుర్తించి వారి తల్లి దండ్రులతో మాట్లాడారు.సర్వశిక్ష అభి యాన్ బాపట్ల జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాలతో ప్రత్యేక క్యాంపు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగి ఉన్న18 సంవత్సరాలలోపు పిల్లలను పాఠశా లల్లో చేర్పించి వారికి విద్యాబుద్ధులు నేర్పించా లన్నారు. వారికి విద్యాబు ద్ధులతో పాటు పరికరాలు అంది ంచడం జరు గుతుందని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యా యు లు మోహనరావు,అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## భద్రకాళి అమ్మవారి వార్షిక వేడుకలు



కర్లపాలెం, మేజర్‌న్యూస్: కర్లపాలెం ఐలాండ్ సెంటర్ లోని భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయ 14 వ వా ర్షిక సంబరాలు బుధవారం ప్రారంభమైనాయి. ఈ సంద ర్భంగా సాగర జలము ,సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు .మధ్యాహ్నం ఎట్రావారిపాలెం గ్రామదేవత శ్రీ రెడంకమ్మ తల్లి ఆలయం నుంచి భద్రకాళి, వీరభద్రస్వామి ఆల యం వరకు పసుపు బండ్లతో ఊరేగింపు ,పట్టు వస్త్రాలు సమర్పణ.ఈ కార్యక్రమంలో కుంచాల సాంబిరెడ్డి ,కొక్కిలిగడ్డ రామరాజు ,కట్టా సుజాత ,దుర్గాప్రసాద్ ,నాగ వర్ధన్ రెడ్డి ,యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న పంచాయతీ అధికారులు





రేపల్లె, మేజర్‌న్యూస్: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్ధ్య అధ్వానంగా ఉండడంతో ప్రజలు విష జ్వరాలు బారిన పడి భయాందోళనలో గురవుతున్నారు పంచాయతీ అధికారులు నిమ్మక నీరు ఎత్తినట్లు వ్యవహరిస్తున్నారని తద్వారా గ్రామాలలో పారిశుధ్యం రోజురోజుకీ అధ్వానంగా తయారవుతుందని అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో గ్రామీణ ప్రజల పరిస్థితి దుర్భరంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిన్న మొన్న వరకు మండే ఎండలు ఇప్పుడిప్పుడే అడపాదడపా పడుతున్న వర్షాలు వాతావరణ మార్పుతో ప్రజలు అల్లాడిపోతున్నారు పోనీ కురిసే వర్షాలు కాలువలకు మీరు చేరి విధంగా పడితే పర్వాలేదని నేలతడుపు చినుకులు పడటం వెంటనే భానుడి ప్రభావంతో ఈ రెండు పరిస్థితులను తట్టుకోలేక ప్రజలు అల్లాడిపోతున్నారు అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ పారిశుధ్యం అక్కడ పేరుకు పోయి ఉండటంతో దోమలు ఈగలు రేయింబవులు స్వైర్య విహారం చేస్తున్నాయి వీటిని అరికట్టేందుకు అధికారులు శ్రద్ధ చూపకపోవడంతో ఇలాంటి వాటిని పరిష్కరించడానికి అధికారులకు తీరిక లేక పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య సమస్య వల్ల ప్రజలు రోగాల బారిన పడి తీవ్ర స్వస్థత గురవుతున్నారని చిన్న పెద్ద తేడా లేకుండా విషపూరిత జ్వరాలతో ప్రభుత్వ ప్రైవేటు వైద్యశాలలో చుట్టూ తిరగాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలలో పారిశుద్ధ్య పరిస్థితి అధ్వానంగా తయారైందని పల్లెల్లో పారిశుధ్యం గురించి పట్టించుకునే అధికారులు లేకపోవడం మండలానికి పట్టిన దురదృష్టమని ఒక అధికారి కూడా గ్రామంలో పర్యటించకుండా విధులు నిర్వహిస్తూ వారి ఆరోగ్యాలు పట్లే వారు శ్రద్ధ చూపుతున్నారు కానీ ప్రజల ఆరోగ్యాలను గాలికి వదిలేసారని ఇలాంటి అధికారుల వల్ల రానున్న రోజులలో సామాన్యుల జీవన ప్రమాణాలు మరింత అద్వానంగా తయారయ్యే పరిస్థితి నెలకొంటాయని గ్రామీణ ప్రజల ఆరోపిస్తున్నారు. పంచాయతీ నిధులను వెచ్చించి వర్షాలు పడి ఆగిపోయిన తర్వాత గుంటల్లో నీరు చేరి దోమలు విస్తృతంగా ఉత్పత్తి అయి పగలు రేయి లేకుండా మనుషులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం నీరు నిలబడిన చోట బ్లీచింగ్ చల్లే పరిస్థితి కూడా గ్రామీణ ప్రాంతాలలో లేకపోవడం అధికారులు నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా కనపడుతున్నాయి కొన్ని గ్రామాలలో మురుగు కాలువలు లేకపోవడం మరికొన్ని గ్రామాలలో మురుగు కాలువల శుభ్రం చేసేవారు లేక ఎక్కడ మురుగు అక్కడే పేరుకుపోయి ప్రజలు అనేక రకాల వ్యాధులు బారిన పడి అల్లాడిపోతున్నారు ప్రధానంగా వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగానే ఇలా వ్యాధుల సంక్రమిస్తాయని ప్రతి ఒక్కరు తమ పరిసరాలను శు భ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైద్యులు సూచిస్తున్నారు అధికారులు ఇప్పటికైనా కళ్ళ తెరిచి గ్రామీణ ప్రాంతాల వైపు పారిశుధ్ధ్య సమస్య నుండి విముక్తి కలిగించేందుకు కృషి చేస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత కార్యాలయాల వద్ద ఆందోళనలు చేపట్టాల్సిన పరిస్థితి కూడా ఉంటుందని హెచ్చరించారు సచివాలయంలో పనిచేసే ఉద్యోగులు కూడా గ్రామీణ ప్రాంతాల పర్యటించకపోవడం అక్కడ సమస్యలను తెలుసుకోకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారిందని ఉన్నతాధికారులు సచివాలయ వ్యవస్థ పై వారి పనితీరుపై దృష్టి పెట్టకపోతే గ్రామీణ ప్రజలకు ఎలాంటి సౌకర్యాలు వసతులు కల్పించలేరని అధికారులు గమనిస్తే బాగుంటుందని గ్రామీణ ప్రాంత ప్రజలు సూచిస్తున్నారు. మేజర్ పంచాయితీయులైన పేటేరు, పెనుమూడి, బేతపూడి, పంచాయతీలలో పారిశుద్ధ్యం అత్యంత దయనీయంగా మారిందని ఈ పంచాయతీలు పట్టణానికి అతి సమీపంలో ఉన్నాయని అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి పారిశుధ్యం పై దృష్టికి సారించాలని ప్రజలు కోరుతున్నారు

# తెలుగు సినీ సాహిత్య సిరి వేటూరి



బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: అలలు కదిలినా పాటే ఆకు మెదిలినా పాటే కలలు చెదిరినా పాటే కలత చెందినా పాటే అంటూ పాటకు ప్రకృతికి జీవితానికి ఉన్న సంబంధాన్ని వేటూరి సుందర రామమూర్తి చాలా చక్కగా వివరించారని రావూరి నరసింహ వర్మ తెలియజేశారు .సాహితీ భారతి ఆధ్వర్యంలో జరిగిన వేటూరి సుందర రామమూర్తి 14 వ వర్ధంతి సభకు సాహితీ భారతి అధ్యక్షులు రావూరి నరసింహ వర్మ అధ్యక్షత వహించారు. వేటూరి దాదాపు 1800 చిత్రాలకు 5 వేలకు పైగా పాటలు రచించారని వివరిం చారు.సాహితీ భారతి ఉపాధ్యక్షులు మర్రి మాల్యాద్రిరావు మాట్లాడుతూ వేటూరి ఓ సీత కథ చిత్రం ద్వారా చిత్ర రంగ ప్రవేశం చేశారన్నారు. వారికి 8 నంది అవార్డులు ఒక జాతీయ పురస్కారం లభించిందని కొనియాడారు.సాహితీ భారతి కోశాధికారి ఆదం షఫీ మాట్లాడుతూ రాలిపోయే పువ్వా నీకు రాగాలెందుకే, కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు, శంకరా నాద శరీరాపరా, ఈ దుర్యోధన దుశ్శాసన దుర్వినీతి లోకంలో వంటి అద్భుత గీతాలతో పాటు ఆరేసుకోబోయి పారేసు కున్నాను, అబ్బనీ తీయ్యని దెబ్బ వంటి శృంగార గీతాలు కూడా వేటూరి రచించారన్నారు. ఈ సభలో మున్నం మస్తాన్ రెడ్డి, కీర్తి వెంకయ్య, ఎం జాకబ్, కస్తూరి శ్రీనివాసరావు,బొడ్డుపల్లి శ్రీరామ చంద్రమూర్తి, తదితరులు వేటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

## విద్యుత్ వోల్టేజ్ సమస్య పరిష్కారం

కర్లపాలెం, మేజర్‌న్యూస్: లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించా మని విద్యుత్ శాఖ ఏ ఈ మల్లెల కుమార్ అన్నారు.కర్లపాలెం సబ్ స్టేషన్లలో బుధవారం పాత ట్రాన్స్ఫార్మర్స్ ను తొలగించి సుమారు 1.50 లక్షలతో 8 ఎం వి ఏ నూతన విద్యుత్ పరి వర్తకంను ఏర్పాటు చేశామన్నారు. దీనివల్ల కర్లపాలెం మం డలంలోని 20 గ్రామ పంచాయతీలలో లో వోల్టేజ్ సమస్యను పరిష్కరిం చామన్నారు.దీని ఏర్పాటుకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిం దని సహకరించిన విద్యుత్ వినియో గదారు లకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఏ ఈ కుమార్ తెలిపారు.




## పచ్చిరొట్ట ఎరువుల ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు



కొల్లూరు, మేజర్‌న్యూస్: కొల్లూరు మండల వ్యవ సాయ అధికారి కార్యాలయంలో మట్టి నమూ నాల సేకరణ పై అవగాహన మరియు, పచ్చి రొట్ట, ఎరు వుల ప్రాముఖ్యమైనఅవగాహన కల్పి ంచడం జరిగింది, జిల్లా శిక్షణ కేంద్రం బాపట్ల నుంచి వ్యవసాయ అధికారి ఆర్ విజయబాబు, ఈ పచ్చి రొట్ట ఎరువుల ఆవశ్యకత మరియు సేంద్రియ ఎరువులపైఅవగాహన కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలోకొల్లూరు మండలం వ్యవసాయ అధికారి ఆర్ వెంకటేశ్వర్లు మాట్లా డుతూ జనము, పులి పెసర అన్ని మండలాల లో ఆర్ బి కె లో అందుబాటులో ఉన్నాయని రైతు లుఈ అవకాశాన్ని విని యోగించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో గ్రామ వ్యవసాయ అధికారు లు రైతులు పాల్గొన్నారు.

## వీరాంజనేయ స్వామికి సింధూర లేపన పూజ



వేమూరు(భట్టిప్రోలు)మేజర్‌న్యూస్: మం డలంలోని జం పని గ్రామంలో వేంచేసి యున్న శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో బుధవారం వార్షిక హను మజ్జయంతి ఉత్సవ కైమ్ కర్యాదులను ప్రారంభించారు.వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఏకాదశి దీక్షతో ఉత్సవాలు నిర్వహించేందుకు సంకల్పించారు తొలి రోజున విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహ వచన,స్వామివారికి పంచామృత అభి .షేకం జరిపి మూలవిరాట్ కు సింధూర లేపన పూజ జరిపారు.పండిత దీవి లక్ష్మీనరసింహాచార్యులు పర్యవేక్షణలో నిర్వహించిన క్రతువు లో అర్చకులు శ్రీనివాస మూర్తి పంచ సూక్తులు, మన్యు సూక్తం,నారాయణ సూక్తులు పారాయణ చేశారు. సాయంత్రం స్వామివారికి అష్టోత్తర శతనామాలు, సహస్రనామాలతో గులాబీ పుష్ప పూజ జరిపారు.ఆంజనేయ భక్త సమాజం ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారా యణ జరిపి భజన కీర్తనలు ఆలపించా రు.అనంతరం పల్లకి ఉత్సవం జరిపారు. చల్లగుండ్ల చిన్న బంగారు బాబు, గుం టూరు వెంకట్రావు, తలశిల గంగా ధరరావు, గాదంశెట్టి వెంకట బదరీ సూర్య నారాయణ,చల్లగుండ్ల నారాయ ణరావు దంపతులు ఉత్సవ దాతలుగా వ్యవహరించారు. దేవాలయ అర్చకు లు అగ్నిహోత్రం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పాపను దత్తత తీసుకున్న అమెరికాలో స్థిరపడిన హైదరాబాద్ దంపతులు



ఒంగోలు, మేజర్‌న్యూస్ : అమెరికాలో స్థిరపడిన తెలుగువారు హైదరాబాద్ దంపతులు ఒంగోలులోని శిశు గృహ పాపను బుధవారం జిల్లా కలెక్టర్ సమక్షంలో దత్తత ఇవ్వడం జరిగింది. అమెరికాలోని జర్జియా రాష్ట్రంలో సొంత సాఫ్ట్‌వేర్ కంపెనీ పెట్టుకొని ఆ దేశంలో స్థిరపడిన హైదరాబాద్‌లోని తెలుగు వారు అజయ్ గోపి (45), అతని భార్య మృదుల ప్రియదర్శిని(40)లు ఒంగోలు

## జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ సమక్షంలో పాప దత్తత

లోని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ సమక్షంలో దత్తత చేసుకున్నారు. అతి తక్కువ సమయంలో ఆ పాపకు సంబంధించిన బర్త్ సర్టిఫికేట్, పాస్ పోర్ట్ పత్రాలను త్వరగా పూర్తిచేసి పాపను వారికి అప్పగించినందుకు జిల్లా కలెక్టర్ కు ఆదంపతులు కృతజ్ఞతలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిశు అభివృద్ధి శాఖాధికారిణి కె. మాధురి, జిల్లా బాలల సంరక్షణ అధికారి పి. దినేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# చిటుక, గొంతువాపు వ్యాధులకు నిరోధక టీకాలు తప్పనిసరి

### జిల్లా పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ ఏ.రమేష్‌బాబు

మద్దిపాడు, మేజర్‌న్యూస్: జీవాలు, పశువులలో వచ్చే చిటుక, గొంతువాపు వ్యాధులకు ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ ఏ.రమేష్ బాబు, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఉపసంచాలకులు డాక్టర్ షేక్ కాలేషా తెలిపారు. మండల పరిధిలోని ఘుడియాపూడి, మద్దిపాడు గ్రామాలలో బుధవారం టీకా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా చిటుక, గొంతువాపు వ్యాధుల నివారణకు టీకాల కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈనెల 22 నుండి వచ్చే నెల 11వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. జీవాల పశుపోషకులందరూ జీవాలకి, పశువులకును వ్యాక్సిన్ వేయించి వ్యాధి బారిన పడకుండా కాపాడుకోవాలని చెప్పారు. మొత్తం 250 గొర్రెలకు వ్యాక్సిన్ వేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ సుగణ్యరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవంగా పంగులూరు భీమలింగేశ్వరస్వామి తిరునాళ్ల



పంగులూరు, మేజర్‌న్యూస్: హర హర అంటూ శివ నామస్మరణలతో పంగులూరులోని శ్రీ పార్వతీ సమేత భీమలింగేశ్వర స్వామి దేవస్థానం పరిసరాలు మారుమోగాయి. మండల కేంద్రం పంగులూరులోని శ్రీ పార్వతీ సమేత భీమలింగేశ్వర స్వామి 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి స్వామివారి ఉత్సవ మూర్తులను ఘనంగా ఊరేగింపు జరిపి గ్రామోత్సవం నిర్వహించారు. శ్రీ భీమలింగేశ్వర స్వామి వారిని పార్వతి అమ్మవారిని పలు పుష్పాలతో విశేష రీతిగా అలంకరణ చేశారు. మహాన్యాస పూర్వక ఏకాదశ భద్రాభిషేకం అమ్మవారికి కుంకుమార్చన పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నకరికంటి గోపి శరవణ శర్మ వ్యాఖ్యాతగా నిర్వహించిన రాయబారం పలువురిని విశేషంగా ఆకట్టుకుంది అనంతరం స్వామివారికి అమ్మవారికి కల్యాణోత్సవం నిర్వహించారు పలువురు దంపతులు పీటలపై కూర్చొని కళ్యాణోత్సవంలో పాలు పంచుకున్నారు. శైవాగమ పండితులు పి ఉదయ భాస్కర శర్మ, దేవస్థాన అర్చకులు చందలూరు సునీల్ శర్మ, కారంచేటి సాంబశివరావు పలువురు అర్చకులు స్వామి వారకి విశేష పూజలు చేశారు. స్వామి వారి కళ్యాణం కనులారా చూసి తరించడానికి అధిక సంఖ్యలో భక్తులు రావడంతో దేవాలయ ప్రాంగణమంతా భక్తజన సందోహంతో నిండిపోయింది.

పౌర్ణమి తిరునాళ్ల సందర్భంగా విద్యుత్ వెలుగులతో దేవాలయాన్ని రంగ రంగ వైభవంగా తీర్చిదిద్దారు. 80 అడుగుల విద్యుత్ ప్రభ మిరీ మిట్లు కొలుపుతూ అందర్నీ ఆకర్షించింది. దేవాలయ శాఖ ఈవో తిరునాళ్లకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 54 మంది మహిళల చే శ్రీ దాస భారతీయ జానపద కళాక్షేత్రం అద్దంకి చెన్నుపల్లి నాగేశ్వరరావు శిష్య బృందం చేసిన కోలాట ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంది. భక్తులంతా స్వామివారిని అమ్మవారిని దర్శించి పూజలు చేశారు టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

తిరుణాల సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.


**NAME CHANGE**

I, ALLAPARTI SRINIVASA RAO S/o. Allaparthi Satyanarayana, R/o. 5-23A, Dammanavari palem, Near Renuka Ankamma Thalli Temple, Karlapalem , Yazali, Bapatla Dist rict, Andhra Prade sh. Changed my na me from ALLAPARTI SRINIVASA RAO to ALLAPAR THI SRINI-VASA RAO. Hence forth I am being called as ALLAPARTHI SRINI VASA RAO S/o. Allaparthi Satyanarayana for all purposes.

**NAME CHANGE**

I, TIRUMALARAJU V SAILAJA (Old Name) W/o. late MANTHENA HARI CHANDRA RAJU, resident of Karlapa lem Village & Man dal, Bapatla District, Andhra Prade sh. Changed my name from TIRU-MALARAJU V SAILA-JA (Old Name) to MANTHENA SAILAJA (New Name). Hence forth I will be called as MANTHENA SAILAJA (New Name) for all purposes.

**NAME CHANGE**

I, CHUNDURI RAMBABU S/o. Siva Prasad residing at 3-5, Returu Village, Kakumanu Mandal, Guntur District, Andh ra Prade sh, India. Changed my name from CHUNDURI RAMBABU (Old Name) to CHUN-DURU RAMBABU (New Name). hence-forth I will be called as CHUNDURU RAM-BABU (New Name) for all purposes.


# హ్యాట్రిక్ వైపు ఎమ్మెల్యే స్వామి

**మొదటి పేజీ తరువాయి** సైతం మంత్రికి దూరంగా వెళ్లడంతో వైకాపా పరిస్థితి ఎన్నికల నాటికి మరింత దిగజారింది.

### కులాల వారీగా విడిపోయిన వైకాపా క్యాడర్

కొండపి నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడు స్థానం కావడంతో ఎస్సీలలోని మాల, మాదిగ సామాజిక వర్గాలుగా క్యాడర్ విడిపోవడంతో వైకాపా అభ్యర్థి ఆదిమూలపు సురేష్‌కు పెను ప్రమాదంగా మారింది. ముఖ్యంగా మాల సామాజికవర్గానికి చెందిన నాయకులు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసుకొని మంత్రి సురేష్‌కు సహకరించకూడదని బాహాటంగానే ప్రకటించారు. ఈ క్రమంలో వీటిని అధిగమించడంలో మంత్రి సురేష్ విఫలమవడంతో కొండపి మరోసారి వైకాపా చేజారే పరిస్థితి నెలకొంది. మంత్రి సురేష్‌కు గత పదేళ్లనుంచి కొండపిలో నాయకులుగా ఉన్న వారు సహకరిస్తారని పార్టీ అధిష్టానం భావించినా అందుకు భిన్నంగా పార్టీ నేతలు వ్యవహరించడం ఇబ్బందిగా మాదింది. ముఖ్యంగా జూపూడి ప్రభాకర్‌రావు వంటి వ్యక్తుల సహకారం కూడా పూర్తి స్థాయిలో లేకపోవడంతో అన్ని మండలాల్లోని ముఖ్యనేతలు, సింగరాయకొండకు చెందిన రాము మంత్రి సురేష్‌కు ఎన్నికల్లో సహకరించలేదని ప్రజల్లో చర్చ జరుగుతుంది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో మంత్రి సురేష్ గెలుపు కష్టమని మరోసారి ఎమ్మెల్యే స్వామి కొండపిలో విజయం సాధించి హ్యాట్రిక్‌ను తన ఖాతాలో వేసుకోనున్నట్లు ప్రజలు అంటున్నారు.

# అంబడిపూడి నాగేశ్వరరావుకు బిఎన్ ఘన నివాళి



నాగులుప్పలపాడు,మేజర్‌న్యూస్: మండలంలోని చదలవాడ గ్రామ అంబేద్కర్‌కాలనిలో మరో రెండు గంటలలో కుమారుడి పెళ్లి, వంట చేపిస్తుండగా హఠాత్తుగా గుండె పోటు రావడంతో పెళ్లి కొడుకు తండ్రి అంబడిపూడి నాగేశ్వర రావు మరణించారు. విషయం తెలియగానే సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బి.ఎన్.విజయ్ కుమార్ వారి భౌతిక కాయానికి సందర్శించి పూలమాల వేసినివాళులర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి, రాష్ట్ర టీడీపీ సెక్రటరీ ఆడక స్వాములు, గుమ్మా వేణు, దేవరపల్లి సురేష్, మండల నాయకులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఐక్యరాజ్య సమితిలో ప్రసంగించేందుకు పవన్ కల్యాణ్‌కు అవకాశం

## కాపు సంఘాల నేతలు హర్షం

ఒంగోలు, మేజర్‌న్యూస్: ప్రకాశం జిల్లా కాపు సంఘం అధ్యక్షుడు కొక్కిరాల సంజీవకుమార్ ఆధ్వర్యంలో నగరంలోని రామ్ నగర్ 1వ లైన్‌లోని కార్యాలయంలో కాపు సంఘ నాయకులతో సమావేశం జరిగింది. జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కొణెదల పవన్ కల్యాణ్ ఐక్యరాజ్య సమితిలో ప్రసంగించుటకు ఆహ్వానం రావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన శుభాకాంక్షలను తెలియజేశారు. కొణెదల పవణ్ కళ్యాణ్ ఐక్యరాజ్యసమితిలో ప్రసంగించుటకు ఆహ్వానం రావటం అత్యంత అరుదైన అవకాశం అన్నారు.

ఈ కార్యక్రమంలో కాపు లాయర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ప్రధాన కార్యదర్శి బండారు శ్రీనివాసరావు, కాపు నాయకులు ముత్యాల నాగేశ్వరరావు, శ్రీపతి సుబ్బయ్య, చెన్నంశెట్టి శివ, మల్లెల చెన్నకేశవులు, పోకల రాంబాబు, తాటి ఆంజనేయులు, రావెళ్ళ వెంకట్రావు, శనగల కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా లక్ష్మీనరసింహస్వామి జయంతి, కళ్యాణం

**- శింగరకొండకు తరలి వచ్చిన భక్తులు**

అద్దంకి మేజర్ న్యూస్: లక్ష్మీ నరసింహ స్వామి జయంతి సందర్భంగా సింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వామి వారి కళ్యాణ మహోత్సవం బుధవారం కన్నుల పండువగా జరిగింది. పాలకమండలి



చైర్మన్ నర్రావుల ఏడుకొండలు, కార్యనిర్వహణాధికారి ఎస్.కోటిరెడ్డి, ఔత్సాహిక భక్తులు జెడ్పీటీసీ మాజీ సభ్యులు సందిరెడ్డి శ్రీనివాసరావు తదితరుల నేతృత్వంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వేడుకలు జరిగాయి. అనంతరం స్వామివారి భక్తబృందంచే ఏకాహం నిర్వహించారు. స్వాతినక్షత్రం సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ఉదయం పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన ఉత్సవమూర్తులను ఆలయ ప్రాంగణంలోని వేదిక వద్దకు చేర్చారు. పూజారి భాగవతులు నరసింహాచార్యులు, ఆయన కుమారుడి ఆధ్వర్యంలో స్వామి వారి కళ్యాణాన్ని కన్నులపండువగా జరిపించారు. కంకణధారణ నుంచి మాంగల్య ధారణ, తలంబ్రాల వరకు శాస్త్రబద్ధంగా జరిగాయి. ఈ సందర్భంగా వచ్చిన భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజన సదుపాయాన్ని కల్పించారు.

## చీమకుర్తిలో అంగరంగ వైభవంగా 'నృశింహ' జయంతి వేడుకలు

**– టి.టి.డి.అర్చకులు పరాంకుశం కృష్ణశాయి భట్టాచార్య నిర్వహణలో**

**నృశింహ ఆవిర్భావ వైభవము గూర్చి ప్రవచనములు, నామ సంకీర్తనలు**

**250 మంది భక్తులచే సామూహిక స్తోత్ర పారాయణములు**

**'సహస్రాధిక వివిధ స్తోత్ర పారాయణ మహాయజ్ఞము'**

చీమకుర్తి, మేజర్‌న్యూస్ః చీమకుర్తి పట్టణంలో నృశింహ జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీ వాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నెల్లూరు, శ్రీ విఖనస సుదర్మా సేవా సమితి ఆధ్వర్యంలో టి.టి.డి.అర్చకులు పరాంకుశం కృష్ణశాయి భట్టాచార్యులు నిర్వహణలో "సహస్రాధిక వివిధ స్తోత్ర పారాయణ మహాయజ్ఞం" భక్తి శ్రద్ధలతో జరిగాయి. ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, విష్వక్సేన పూజ, స్వస్తిపుణ్యావాచనము, రక్షాకంకణ పూజ, రక్షాకంకణ ధారణ,









దీక్షా స్వీకరణ 250 మంది భక్తులచే సామూహిక స్తోత్ర పారాయణములు, సాయంత్రం 5 గంటల వరకు 5 ఆవృత్తములు పారాయణము చేయట జరిగినది. అనంతరం నృశింహ ఆవిర్భావ పుణ్యకాలమున స్వామివారికి విశేష స్నపన తిరుమంజనము, నృశింహ ఆవిర్భావ వైభవము గూర్చి ప్రవచనములు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

# గొడవలు సృష్టించుకోవద్దు - జీవితాలను నాశనం చేసుకోవద్దు

**- ఎస్ఐ వేముల సుధాకర్**



తర్లుపాడు, మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన తర్లుపాడులోని స్థానిక బస్టాండ్ సెంటర్లో సీతాలమ్మ గుడి వద్ద ద్విచక్ర వాహనదారులతో, గ్రామ ప్రజలతో తర్లుపాడు మండల ఎస్సై వేముల సుధాకర్ మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలో ఎన్నికల సమయంలోనూ, ఎన్నికల అనంతరం జరిగిన పరిస్థితులు దృష్టిలో పెట్టుకొని ప్రజలందరూ పోలీస్ శాఖ వారు ఇచ్చిన సూచనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. ద్విచక్ర వాహనాలను, వాహనదారులు నడిపేటప్పుడు చట్టపరమైన వాటికి సంబంధించిన కాగితాలన్నింటిని సంబంధిత అధికారుల విచారణలో తప్పనిసరిగా చూపించాలన్నారు. రోడ్లపై ఎక్కడ భడితే అక్కడ వాహనాలను నిలుపురాదన్నారు. గుంపులు గుంపులుగా ఉండి ముచ్చటించరాదన్నారు. ఎవరి పనులలో వారు నిమగ్రిమై ఉండాలన్నారు. వాహనదారులు నియమ నిబంధనలు పాటించని యెడల వారి వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించడం జరుగుతుందన్నారు. అనంతరం ఎవరు సిఫారసులు అనుమతించబడవు అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అక్కడక్కడ జరిగిన చెదురు ముదురు సంఘటనలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో ప్రజలు గమనించాలని హితవు పలికారు. బంగారం లాంటి మీ భవిష్యత్తును క్షణిక ఆవేశాలకు గురికాకుండా ప్రతి ఒక్కరూ ఎన్నికల కౌంటింగ్‌కు ముందు, తరువాత ప్రశాంత వాతావరణంలో ఒకరికొకరు స్నేహపూర్వకంగా మెలగాలని ప్రజలకు వివరించారు. ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రామకృష్ణారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పోటీ తత్వ పఠనంతో విజయం

చీరాల, మేజర్ న్యూస్: వివిధ పోటీ పరీక్షలకు హాజరై అభ్యర్థులు పోటీతత్వంతో పుస్తక పఠనం చేస్తే విజయం దానంతటదే వరిస్తుందని శాసన మండలి సభ్యుడు కెఎస్ లక్ష్మణరావు సూచించారు. స్థానిక సెయింట్ మార్క్స్ లూథరన్ ఎయిడెడ్



కళాశాల లో బుధవారం వివిధ సంఘాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మెయిన్స్‌కు అర్హత సాధించిన అభ్యర్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రణాళిక బద్ధంగా అధ్యయనం చేస్తే అత్యధిక మార్కులు సాధించవచ్చని సూచించారు. అనంతరం అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్ చరిత్ర అనే పుస్తకాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమలో కళాశాల కరస్పాండెంట్ శీలం విద్యాసాగర్, ప్రిన్సిపాల్ జి పుష్పరాజు, పి జయశీలరావు, డిబిఆర్‌సి కోఆర్డినేటర్ వి భగవాన్‌దాస్, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేరంగుడిపల్లిలో కార్డెన్ సెర్చ్



కనిగిరి, మేజర్‌న్యూస్: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని పేరంగుడిపల్లి గ్రామంలో బుధవారం ఉదయం ఏడు గంటల సమయంలో కనిగిరి డీఎస్పీ రామరాజు ఆధ్వర్యంలో కనిగిరి సీఐ వెంకటేశ్వరరావు, కనిగిరి ఎస్సై త్యాగరాజు, హెచ్‌ఎం పాడు ఎస్సై శివ నాగరాజు, పీ.సీ.పల్లి ఎస్ఐ



రమేష్ బాబు, కనిగిరి సర్కిల్ పోలీస్ సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో సోదాలు నిర్వహించి సరైన పత్రాలు లేని మోటార్ సైకిల్ వాహనాలను గుర్తించి వాటిని స్టేషన్ కు తరలించారు. గ్రామంలో ఎవరైనా కొత్త వ్యక్తులు, ప్రజాశాంతికి భంగం కలిగించే వారిని గుర్తించుటకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు డిఎస్పీ రామరాజు తెలిపారు.



## ప్రశాంత లెక్కింపుకు సహకరించాలి

చీరాల రూరల్, మేజర్ న్యూస్: ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా జరిగే విధంగా ప్రజలు సహకరించాలని రెండో పట్టణ సీఐ జి సోమశేఖర్ కోరారు. ఓట్ల లెక్కింపు కార్యక్రమం లో భాగంగా స్థానిక శృంగారపేటలో బుధవారం పోలీస్ సిబ్బంది మరియు ప్రత్యేక బలగాలతో సీఐ సోమశేఖర్ కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సోమశేఖర్ మాట్లాడుతూ జిల్లా ఎస్సీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు, డీఎస్సీ బేతపూడి ప్రసాద్ సూచనల మేరకు పోలీసులు మరియు ప్రత్యేక బలగాలు కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహిస్తున్నామని సీఐ సోమశేఖర్ అన్నారు.

## గరికమిట్టలో కార్డన్ సెర్చ్‌లో 14 వాహనాలు స్వాధీనం



చీమకుర్తి, మేజర్‌న్యూస్ః చీమకుర్తి పట్టణంలోని గరికమిట్టలో బుధవారం చీమకుర్తి సి.ఐ.,ఓ.దుర్గాప్రసాదు, ఎస్.ఐ.క్రిష్ణయ్య, పోలీస్ సిబ్బంది ఆద్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. రికార్డులు లేని 14 వాహనాలను పోలీస్ స్టేషన్‌కు





తరలించారు. రికార్డులుంటే పోలీస్ స్టేషన్‌కు వచ్చి వాహనాలను తీసువెళ్లవచ్చునన్నారు. రికార్డులు లేని వాహనాలపై చట్టపరంగా చర్యలు చేపడతామని సి.ఐ.తెలిపారు. అధే విధంగా ఎవరైనా అపరిచిత వ్యక్తులు వచ్చి అపార్ట్‌మెంట్లలో ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

## విద్యాకానుకల నిర్వహణపై సమావేశం

కందుకూరు, మేజర్‌న్యూస్: కందుకూరు ఉప విద్యాశాఖ అధికారి కార్యాలయంలో కందుకూరు డివిజన్ మండల విద్యాశాఖ అధికారుల మరియు అసిస్టెంట్ ఇంజనీర్లు తో డిప్యూటీ డిఇఓ ఎంవివి ప్రసాద్‌రావు తో సమావేశం జరిగింది. ఎస్ఓపి ప్రకారం విద్యా కానుకలు మండల విద్యా కేంద్రంలో ఏ విధంగా సిద్ధం చేసుకోవాలి విద్యార్థులకు సంబంధించి రక్తహీనత కలిగిన విద్యార్థులకు పోలిక్ యాసిడ్ మాత్రలు వినియోగం, సెలవుల్లో వి లవ్ రీడింగ్ అనే కార్యక్రమం, పాఠశాలలకు అందించిన ఐఎఫ్ పీ పానాల్స్ ఏ విధంగా పనిచేస్తున్నాయి వాటిని గురించిన సమాచారము కలిగి ఉండటం నాడు నేడు పనులు వేగవంతం చేయటం పాఠశాలలు వంటి అంశాలపై సూచనలుచేశారు. జూన్ 12వ తేదీ తెరుస్తున్నందున దానికి సంసిద్ధత చేసుకోవడం . పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ మొదలగు అంశాలు , వలేటివారిపాలెం గుడ్లూరు కందుకూరు బాయ్స్ ఉలవపాడు గవర్నమెంట్ హై స్కూల్ నందు 24 వ తేదీ నుండి నిర్వహించబోతున్న పరీక్షల గురించి ఏర్పాట్ల గురించి చర్చించారు. ఈకార్యక్రమంలో శివకుమార్, గోవర్ధన, అసిస్టెంట్ ఇంజనీర్ రసూల్, సీసీ రవితేజ పాల్గొన్నారు.



## విజ్ఞాన భాండాగారాలు.... గ్రంథాలయాలు

అద్దంకి, మేజర్ న్యూస్: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని సాయి పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ వీరాజు అన్నారు. పట్టణంలోని బంగ్లా రోడ్డు నందు గల శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ఏడవ రోజు బుధవారం జరిగింది. గ్రంథ పాలకుడు సుగుణ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 26 మంది విద్యార్థులు పాల్గొన్నారు. స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసులు, క్విజ్ పోటీలు, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ శాఖ గ్రంథాలయాల ఆధ్వర్యంలో వేసవిజ్ఞాన శిబిరాలు ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థుల మేధస్సుకు చక్కగా ఉపయోగపడుతున్నాయి అన్నారు. అనంతరం పోటీలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవం చేశారు.



## గుడిమెట్టలో కార్డెన్ సెర్చ్

రాచర్ల, మేజర్‌న్యూస్: మండలంలోని గుడిమెట్ట గ్రామంలో బుధవారం గిద్దలూరు రూరల్ సీఐ దాసరి ప్రసాద్, రాచర్ల ఎస్ఐ హరిబాబు ఆధ్వర్యంలో కార్డెన్ సర్చింగ్ నిర్వహించారు. ఈ కార్డెన్ సర్చ్‌లో సరైన



ధ్రువపత్రాలు లేని 13 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల ఓట్లు లెక్కింపు సందర్భంగా ఎవరు కూడా అల్లరకు పాల్పడకుండా పోలీసులకు సహకరిస్తూ కలిసిమెలిసి ఉండాలని ప్రజలకు సీఐ దాసరి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. అల్లర్లు చేసేందుకు ప్రయత్నిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ దాసరి ప్రసాద్ ప్రజలను హెచ్చరించారు. ఎక్కడ ఎటువంటిది అల్లర్లు జరగకుండా ఉన్నత అధికారుల ఆదేశాలు మేరకు ముందస్తుగా కార్డన్ సెర్చ్‌లు నిర్వహిస్తున్నట్లు సిఐ దాసరి ప్రసాద్ వెల్లడించారు. ఈ కార్డన్ సెర్చ్‌లో కొమరోలు ఎస్సై మధుసూదన్ రావుతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు నారాయణ స్వామి కళ్యాణం

ముండ్లమూరు, మేజర్‌న్యూస్: మండలంలోని తూర్పు కంభంపాడులో శ్రీ నారాయణ స్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కల్యాణమహోత్సవంలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించాలని కోరారు. గ్రామంతో పాటు పరిసర గ్రామాల భక్తులు పాల్గొని పూజలు నిర్వహించాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో దర్శి ఎన్.డి.ఎ కూటమి ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పాల్గొని పూజ కార్యక్రమంలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ను ఏర్పాటు చేయటం జరిగినదని తెలిపారు. ఆ గ్రామానికి చెందిన ఉన్నం చారిటబుల్ ట్రస్ట్ అధినేతలు ఉన్నం నరసింహ రావు, ఉన్నం రామాంజనేయులు గ్రామంలో తమకు గల 13 ఎకరాల పొలంను గ్రామంలో గల వివిధ దేవాలయాలకు రాసి ఇస్తున్నారు. వారి ఇరువురుకి గ్రామస్తులు ప్రజా సన్మానం ఏర్పాటు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు.

# ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

## - జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి సురేష్ కుమార్

ఒంగోలు, మేజర్‌న్యూస్: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖఅధికారి ఛాంబర్ నందు పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులకు డాక్టర్ డి.సురేష్ కుమార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్.సి.హెచ్, చైల్డ్ హెల్త్, ఇమ్యునైజేషన్, టి.బి. లెప్రసీ, ముఖఛాయ చిత్రము హాజరు, అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రములపై కేటాయించిన టార్గెట్ సాధించని వారిపై తగ్గు చర్యలు గైకొనబడునని తెలిపారు. ప్రతి ఆరోగ్య కార్యకర్త ప్రతి గర్భిణీ స్త్రీని సకాలములో రిజిస్టర్ చేసి వారి వివరాలను ఆర్.సి.హెచ్.పోర్టల్ నందు అప్ లోడ్ చేయాలన్నారు. ప్రసవం, ప్రసవానంతరం వరకు అందించవలసిన సేవలను విధిగా అందించి వివరాలను వెబ్ పోర్టల్ నందు నమోదు చేయవలెను ప్రతి గర్భిణీస్త్రీకి యం.సి.పి. కార్డును అందచేసి అన్ని వివరాలను నమోదు చేసి సంబంధిత వైద్య అధికారిచే ధృవీకరించాలన్నారు. ఈ సేవలను అన్నిటిని సంబంధిత వైద్య అధికారులు, పర్యవేక్షకులు పర్యవేక్షించి తగు సూచనలు, సలహాలు అందచేయవలెను ప్రతి ఒక్కరు ముఖఛాయ చిత్రము తప్పనిసరిగా సకాలంలో వేయాలన్నారు. ప్రతి ఆశా కార్యకర్త, యమ.యల్.హెచ్.పి అనుమానిత దగ్గుతో బాధపడుచున్న



రోగులను గళ్ళ పరీక్ష కొరకు వారికి కేటాయించిన లక్షణముల ప్రకారం సంబంధిత ల్యాబ్‌కు పంపాలన్నారు. ఎవరైన విధుల పట్ల నిర్లక్ష ధోరణి వహించనన్ను కేటాయించిన లక్ష్యాలను సాధించని వారిపై గైకొనబడునని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.పి.యమ్.ఓ డాక్టర్ వాణిశ్రీ, డి.పి.హెచ్.యన్.ఓ సుగుణమ్మ, డి.పి.ఓ.సుబ్బలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

## పచ్చిరొట్ట ఉపయోగించి రైతులు నేలసారం పెంచుకోవాలి

వేటపాలెం, మేజర్‌న్యూస్: నేల సారం పెంచుకోవడానికి పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేయడం ఎంతో ఉపయోగకరంగా వుంటుందని రైతులకు



50శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు అందజేయడానికి మండలంలో విత్తనాలు సిద్ధమయ్యాయి. ప్రస్తుతం వేటపాలెం మండలానికి సంబంధించి జీలుగ-27 క్వింటాళ్లు, పిల్లిపెసర-20 క్వింటాళ్లు, జనుము-9 క్వింటాళ్లు కేటాయించారు. మండలంలోని చల్లారెడ్డిపాలెం-2 రైతు భరోసా కేంద్రంలో జీలుగ-3.5 క్వింటాళ్లు, పిల్లిపెసర-5 క్వింటాళ్లు అందుబాటులో వున్నాయి. బుధవారం చల్లారెడ్డిపాలెం-2 రైతు భరోసా కేంద్రం పరిధిలోని రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు 50శాతం సబ్సిడీపై అందజేయడం జరిగినది.

## వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నాగులుప్పలపాడు, మేజర్‌న్యూస్: ఉప్పుగుండూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి స్వామి వార్లను హనుమంత వాహనం సేవ శ్రీ రామావతరం అలంకరణతో పురవీధులలో గ్రామోత్సవం నిర్వహించడం జరిగింది. భక్తులుకు, పౌరులుకు కనువిందుగా ఈ కార్యక్రమాన్ని ట్రస్ట్ బోర్డు చైర్మన్ పెంటల జ్యోతి శ్రీనివాసరావు, ఈఓ మినిశెట్టి శ్రీను, అర్చకులు శ్రీధర్ బాబు, సిబ్బంది వేణు, సుబ్బారావు, కమిటీ సభ్యులు ఏర్పాట్లు గావించారు.

## విద్యార్థులకు గణితంలో మెళకువలు



మార్కాపురం, మేజర్‌న్యూస్: పట్టణంలోని స్థానిక శాఖ గ్రంథాలయం నందు బుధవారం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో విద్యార్థులచే కథలు చెప్పించడం, పుస్తకములు చదివించడం, పుస్తక సమీక్ష చేయించడం, చదరంగం నేర్పించడం జరిగినది. సాధన డిగ్రీ కళాశాల లెక్చరర్ డాక్టర్ ఎం.శేషు కుమార్‌చే గణితంలో మెలుకువలు,ఏకాగ్రత గురించి, న్యూటన్ పెండ్యులం గురించి వివరించడం జరిగినది. విద్యార్థినీ విద్యార్థులకు పాటలు పాడుట నేర్పించడం జరిగినది. ఈ కార్యక్రమంలో 15 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనినారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాఖ గ్రంథాలయ గ్రంథ పాలకులు జీవి శివారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో ఇంటర్మీడియట్ కోర్స్‌లు ప్రారంభం

సంతనూతలపాడు, మేజర్‌న్యూస్: ప్రభుత్వ ఆదేశాల మేరకు సంతనూతలపాడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత సంతనూతలపాడు నందు 2024-25 విద్యా సంవత్సరం నుండి ఇంటర్మీడియట్ కోర్సులు ప్రారంభించడం జరుగుతుందని ఎంఈఓ డి.వెంకట్ రెడ్డి, హెచ్‌ఎంపి రామారావులు బుధవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఎంపీసీ, బైపిసి, సిఇసి కోర్సులలో విద్యార్థుల డిమాండ్ ఆధారంగా ఏదైనా రెండు కోర్సులు ప్రవేశాలు కల్పించడం జరుగుతుందని కో ఎడ్యుకేషన్ విధానంలో ఈ కోర్సులు నిర్వహించడం జరుగుతుందని ఆయన అంటున్నారు. పదవ తరగతి వార్షిక పరీక్షల్లో, ఓపెన్ స్కూల్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థిని విద్యార్థులు అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు రాయబోతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోల్సిందిగా ఎంఈఓ వెంకట్ రెడ్డి కోరారు. ఆసక్తి ఉన్న విద్యార్థిని విద్యార్థులు వెంటనే పాఠశాల ప్రధానోపాధ్యాయిని సంప్రదించి మీ సీటు రిజర్వ్ చేసుకోవాలని సూచించారు.

## డీసీఎం లారీ మినీ వ్యాను ఢీకొని ఒకరు మృతి

కనిగిరి, మేజర్‌న్యూస్: కనిగిరి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో మాచవరం నుండి కనిగిరి వైపు వస్తున్న భవన నిర్మాణ కార్మికుల డీసీఎం లారీని విజయవాడ నుండి కడప వైపు వెళ్తున్న కర్ణాటక కు చెందిన మినీ వ్యాన్ వాహన డ్రైవరు అతివేగంగా అజాగ్రత్తగా నిర్లక్ష్యంగా నడిపి డిసిఎం లారీని ఢీకొట్టగా ఈ ప్రమాదంలో డీసీఎం లారీ రోడ్డు ప్రక్కన బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మాచవరం గ్రామానికి చెందిన ఉప్పు రమాదేవికి బలమైన గాయాలు కాగా స్థానిక గోపీనాథ్ హాస్పిటల్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు తీసుకు వెళుతుండగా మార్గమధ్యలో పొదిలి దగ్గర మృతి చెందినట్లు ఎస్సై టి.త్యాగరాజు తెలిపారు. ఆ వాహనంలో ప్రయాణిస్తున్న ఇతర కార్మికులకు కూడా గాయాలు కాగా వారందరు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నట్లు చెప్పారు. రోడ్డు ప్రమాదానికి సంబంధించి ఎస్సై త్యాగరాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



## నేడు కోదండ రామాలయంలో వైశాఖ పౌర్ణమి

దర్శి, మేజర్‌న్యూస్: గాంధీ నగర్‌లోని కోదండ రామాలయంలో గురువారం వైశాఖ పౌర్ణమి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మన గాంధీనగర్‌లోని కోదండ రామాలయం నందు వైశాఖ పౌర్ణమి గురువారం సందర్భంగా ఉదయం మూలవిరాట్లకు అభిషేక కార్యక్రమం అలాగే సాయంత్రం 6:30 నుంచి ఉత్సవ విగ్రహాలకు అభిషేక కార్యక్రమం తరువాత హరే రామ సంకీర్తనలతో స్వామివారి పల్లకి సేవ కార్యక్రమంలో నిర్వహించటం జరుగుతుంది అన్నారు. అలాగే స్వామివారి పవళింపు సేవ కార్యక్రమం జరుగును అని తెలిపారు. వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. భక్తులు అందరు వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా నిర్వాహకులు కోరారు. ఉభయ దాతలుగా బొమ్మిరెడ్డి లక్ష్మిరెడ్డి ధర్మపత్ని వెంకట సుబ్బులు పాల్గొంటారని కోదండ రామస్వామి దేవస్థానం కమిటీ తెలిపారు.

## వృద్ధులకు, విద్యార్థులకు నిత్యావసరాలు పంపిణీ

ఒంగోలు, మేజర్‌న్యూస్: తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా మధిర పట్టణ వాస్తవ్యులు మహేంద్ర రెడ్డి వారి సతీమణి ఉదయలక్ష్మి దంపతుల ముద్దుల జ్యేష్ట కుమారుడు చిరంజీవి నాగధీరన్ రెడ్డి పుట్టినరోజు సంధర్భంగా శ్రీ విశ్వ



వికాస భారతి సేవా సంస్థ గౌరవ సలహాదారులు నిమ్మల అనిల్ కుమార్ ప్రోత్సాహంతో వారి కుటుంబ సభ్యుల సహకారంతో శ్రీ విశ్వ వికాస భారతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఒంగోలు బలరామ్ కాలనిలో ఉషోదయ వృద్ధాశ్రమంలో వృద్ధులకు నిత్యావసర వస్తువులు, హౌసింగ్ బోర్డు బొమ్మరిల్లు అనాధ శరణాలయంలో విద్యార్థులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో శ్రీ పోతులూరి శివ బ్రహ్మాచార్యులు కోవూరి జగదీష్, వంకేశ్వరం గోవింద్, బొమ్మరిల్లు నిర్వాహకులు కాశీం, ఉషోదయ వృద్ధాశ్రమం నిర్వాహకురాలు కోటమ్మ తదితరులు పాల్గొని పుట్టినరోజు శుభాకాంక్షలు శుభాశీస్సులు తెలియజేశారు.

## చీమకుర్తి గ్రంథాలయాన్ని సందర్శించిన జిల్లా కార్యదర్శి



చీమకుర్తి, మేజర్‌న్యూస్ః చీమకుర్తి పట్టణంలోని గ్రందాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్న తీరును సందర్శించేందుకు బుధవారం ప్రకాశం జిల్లా గ్రందాలయ కార్యదర్శి కె.ఆదిలక్ష్మి సందర్శించారు. గ్రందాలయపాలకుడు నిత్యకళ్యాణరావుకు గ్రందాలయ కార్యదర్శి ఆదిలక్ష్మి పలు సూచనలు, సలహాలు తెలియజేశారు. జూన్ 7వ తేది వరకు వేసవి విజ్ఞాన శిభిరాలు నిర్వహించటం జరుగుతుందని, ప్రతి రోజు ఉదయం 8 గంటల నుండి



12 గంటల వరకు విద్యార్థిని, విద్యార్థులకు కథలు, కథనాలు, పుస్తక సమీక్ష, యోగ, నృత్యాలు తదితర కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో గ్రంధపాలకుడు నిత్యకళ్యాణరావు, విషయనిపుణులు జి.ప్రతాప్ కుమార్, జి.ఆనంద్, కర్నా ప్రేమ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

# విద్యా పథకాలు అర్హులందరికి అందేలా చూడాలి





ఒంగోలు, మేజర్‌న్యూస్: సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ ప్రభుత్వం వారి ఆదేశాల మేరకు విజయ కృష్ణన్ ప్రకాశం జిల్లాలోని డిగ్రీ ఆపై ఉన్న అన్ని కళాశాలలలో చదువుచున్న యస్.సి, ఎస్.టి, బిసి, ఇ.బి.సి, మైనారిటీ విద్యార్థిని, విద్యార్థులకు 2023-24నకు విద్యా దీవెన, వసతి దీవెన పథకమునకు సంబంధించిన 8 అంశములపై యన్.లక్ష్మా నాయక్ డిప్యూటీ డైరెక్టర్ సాంఘిక సంక్షేమ శాఖ, ప్రకాశం జిల్లా వారిచే డా.బి.ఆర్.అంబేద్కర్ భవనం నందు సమీక్ష సమావేశము నిర్వహించారు. ఒంగోలు డివిజన్ పరిధిలో ఉన్న వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్స్, వార్డ్ ఎడ్యుకేషనల్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ, కళాశాల కోర్డినటర్స్‌నకు క్రింద తెలిపిన విద్యా దీవెన, వసతి దీవెన పథకంకు సంబంధించిన 8 అంశాలకు సంబంధించి అర్హత కలిగిన యస్.సి, ఎస్.టి, బిసి, ఇ.బి.సి, మైనారిటీ విద్యార్థిని, విద్యార్థులకు విద్యా దీవెన, వసతి దీవెన లబ్ది చేకూరే విధముగా దిశ నిర్దేశం చేశారు. విద్యా దీవెన, వసతి దీవెనకు సంబంధించి జాయింట్ ఖాతాలను ఇప్పటివరకు అప్డేట్ కాని విద్యార్థిని, విద్యార్థుల ఖాతాలను అప్డేట్ చేయవలసినదిగా ఆదేశించారు. 2019-20 విద్యా సంవత్సరంకు సంబంధించి విడుదలైన విద్యా దీవెన నగదును సంబంధిత కళాశాలలకు జమచేయని వారి తల్లులకు ఖాతాలకు సంబంధించి నవశకం లాగిన్ నుండి డౌన్లోడ్ చేసిన నోటిస్‌ను వారికి అందజేసి లాగిన్ నందు అప్డేట్ చేయాలన్నారు. గడిచిన త్రైమాసికం వరకు విడుదలైన నిధులను కళాశాలలకు చెల్లించని తల్లులకు ఫీజు కళాశాలలకు చెల్లించు విధంగా విద్యార్థుల తల్లులకు కౌన్సిలింగ్ నిర్వహించి నవశకం లాగిన్ నందు అప్డేట్ చేయాలన్నారు. 2023-24 విద్యా సంవత్సరంకు సంబంధించి 5 స్టెప్స్ వెరిఫికేషన్ పెండింగ్‌లో ఉన్న ధరఖాస్తులను పరిశీలించి కారణాలను నవశకం లాగిన్ నందు అప్డేట్ చేయాలన్నారు. 2022-23 విద్యా సంవత్సరంకు సంబంధించి (నాల్గవ త్రైమాసికం) కళాశాలలకు ఫీజు చెల్లించని తల్లుల వివరాలను సెక్రటేరియట్ నవశకం లాగిన్ నందు అప్డేట్ చేయాలన్నారు. 2022-23 విద్యా సంవత్సరంకు సంబంధించి (నాల్గవ త్రైమాసికం) కళాశాలలకు ఫీజు చెల్లించని తల్లులకు నోటీసులు అందచేయని వారి వివరములను సెక్రటేరియట్ నవశకం లాగిన్ నందు అప్డేట్ చేయాలన్నారు.

2022-23 విద్యా సంవత్సరంకు సంబంధించి (నాల్గవ త్రైమాసికం) కళాశాలలకు ఫీజు చెల్లించని తల్లులకు కౌన్సిలింక్ నిర్వహించి వారి వివరాలను సెక్రటేరియట్ నవశకం లాగిన్ నందు అప్డేట్ చేయాలన్నారు. యన్.పి.సి.ఐ పెండింగ్ ఉన్న యస్.సి విద్యార్థుల ఆధార్ నెంబర్‌ను బ్యాంకు ఖాతాకు అనుసందానం చేయించాలన్నారు. పై అంశములకు సంబంధించి త్వరితగతిన నిర్ణీత సమయం నందు అప్డేట్ చేయని అధికారులపై శాఖపరమైన చర్యలను తీసుకోవటం జరుగుతున్నదని తెలియపరిచారు. ఈ సమావేశంలో యం.ఉదయశ్రీ సహాయ సాంఘిక సంక్షేమాధికారిణి, ఒంగోలు యు.దానయ్య సహాయ సాంఘిక సంక్షేమాధికారి కొండేపి, కె. శ్రీనివాసులు సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి, ఒంగోలు డి.అమరసుబ్బయ్య సహాయ గిరిజన సంక్షేమాధికారి, ఒంగోలు వారు హాజరైనారు.

## జిల్లా గ్రంథాలయంలో కొనసాగుతున్న వేసవి శిక్షణా శిబిరం

ఒంగోలు, మేజర్‌న్యూస్: నగరంలోని జిల్లా గ్రంథాలయంలో ఈనెల 15 నుండి జూన్ 7వ తేది వరకు జరుగు వేసవి శిక్షణ శిబిరంను



ఉపగ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి బుధవారం నిర్వహించారు. బుధవారం 7వ రోజు జిల్లా కేంద్ర గ్రంథాలయం నందు జరిగిన కార్యక్రమం నందు 81 మంది పిల్లలు హాజరగుట జరిగింది. ఈ వేసవి విజ్ఞాన శిబిరంలో పుస్తక పఠనం, స్పోకెన్ ఇంగ్లీష్, మ్యాథ్స్, హిందీ తదితర సబ్జెక్ట్స్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, సిహెచ్.సుధాకర్ రావు, మంచికంటి వెంకటేశ్వరరెడ్డి, షిర్డీ సాయిరాం, దాసరి లక్ష్మి ప్రసాద్, ఉపాధ్యాయులు, గ్రంథాలయ సిబ్బంది సంపూర్ణమ్మ, డి.సందీప్, పి.ఇమ్మానుయేలు, యస్.అనిల్ బాబు, రిటైర్డు డిప్యూటీ కలెక్టర్ పి. పేరయ్య, పాఠకులు పాల్గొన్నారు.

## 27 ద్విచక్ర వాహనాలు సీజ్



సంతనూతలపాడు, మేజర్‌న్యూస్: జిల్లా ఎస్పీ గరుడు సుమిత్ సునీల్ ఆదేశాల మేరకు కార్బన్ సెర్చ్‌లో భాగంగా బుధవారం సంతనూతలపాడు వడ్డెరపాలెం నందు సరైన పత్రాలు లేని 27 వాహనాలను సీజ్ చేసినట్టు సంతనూతలపాడు ఎస్సై ఏం.దేవకుమార్ తెలిపారు. వాహనాలకు నెంబర్లు డాక్యుమెంట్ లేనివి ఈ మేరకు దాడి చేసి వాటిని పట్టుకొని సీజ్ చేసినట్టు ఎస్సై దేవకుమార్ తెలిపారు. జూన్ 4న కౌంటింగ్ పురస్కరించుకొని ఎటువంటి ర్యాలీలు ప్రదర్శనలకు అనుమతులు లేవని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇందుకు విరుద్ధంగా ఎవరైనా పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్టు ఎస్సై దేవకుమార్ హెచ్చరించారు. అంతేకాకుండా వారిపై రౌడీ షీట్ తదితరు కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో నడుచుకోవాలన్నారు. ఒంగోలు సిఐ టీఎస్.అజయ్ కుమార్ ఆధ్వర్యంలో సంతనూతలపాడు, మద్దిపాడు సబ్ ఇన్స్పెక్టర్ దేవకుమార్ మహేష్, నాగులుప్పలపాడు, సంతనూతలపాడు, మద్దిపాడు మండలాల పోలీస్ సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారు.

## నీటి సమస్య పరిష్కరించాలని కమిషనర్ ఆదేశాలు

పొదిలి ,మేజర్ న్యూస్: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని కోర్టు సెంటర్ వద్ద గల సాగర్ ట్యాంకు వద్ద గత కొంతకాలంగా గేట్ వాల్ పాడై మరమ్మతులకు నోచుకోక ఆ ప్రాంత ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమాచారం తెలుసుకున్న నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి తక్షణం స్పందించారు. వెంటనే మరమ్మతులు చేయాలని



సిబ్బందిని ఆదేశించారు. దీంతో మున్సిపాలిటీ ఏఈ భూపాల్ రెడ్డి దగ్గరుండి సిబ్బంది సాయంతో మరమ్మతులు చేయించారు. కమిషనర్ చొరవతో నీటి సమస్య తీరిందని ఆ ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

## తాగునీటి సమస్యలు పరిష్కరించాలి

వెలిగండ్ల, మేజర్‌న్యూస్: తాగునీటి సమస్య పరిష్కరించాలని, సబ్సిడీపై దాణా సప్లై చేయాలని ఏపీ గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వెలిగండ్ల మండలంలోని వెలిగండ్ల, రాళ్లపల్లి, వెదుళ్ళచెరువు, కమ్మపాడు, జాళ్లపాలెం, పందువ, తదితర గ్రామాలలో పర్యటించి గొర్ల కాపరుల సమస్యలు పరిశీలించడం జరిగింది. మండలంలో వేలాది జీ వాలు వందలాది కుటుంబాల ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రధానంగా వర్షాలు సరిగా లేక తీవ్రమైన ఎండల వలన చెరువులు కుంటలు ఎండిపోయి గొర్రెలకు తాగనీరుఎక్కడ అందుబాటులో లేదని తెలిపారు. అంతేకాకుండా మేత సమస్య కూడా తీవ్రంగా ఉన్నదని దీనికోసం సుదూర ప్రాంతాలైన, కందుకూరు ప్రాంతానికి వలసలు పోతున్నామని తెలిపారు. అక్కడ కూడా వర్షాలు లేక మేత దొరకడం లేదని వారు తెలియజేయడం జరిగింది. ఒకవైపు నీళ్లు మరోవైపు మేత లేక గొర్రెలు బక్క చిక్కిపోతున్నాయని కాపర్లు ఆందోళన వ్యక్తం చేశారు. కనుక



ప్రభుత్వం వెంటనే వలసల నివారణ కోసం సబ్సిడీ దాణా సప్లై చేయాలని, ప్రతి గ్రామంలో బోర్లు వేసి నీటి తోట్లు కట్టించాలని, బోర్లు పడని పక్షంలో ట్యాంకర్లు ద్వారా నీటితోట్లు నింపి మూగజీవాల దాహార్తిని తీర్చాలని వాటిని కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండే బాలకృష్ణ, స్థానిక కాపర్లు పెరుగు వెంకటరావు, తిరుపాలు, కడెం లక్ష్మయ్య, అరవ నాగయ్య, పాల్గొన్నారు.

## గ్రంథాలయంలో లెమన్, స్పూన్ పోటీలు



ఉలవపాడు, మేజర్‌న్యూస్: వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల్లో భాగంగా ఉలవపాడు శాఖా గ్రంధాలయంలో గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులతో విజ్ఞాన సంబంధమైన పుస్తకాలు చదివించి పిల్లల మానసిక ఆనందం కోసం లెమన్, స్పూన్ ఆటను ఆడించారు. కె.మల్లికా దేవి స్టేట్ బ్యాంక్ మేనేజర్ చాకిచర్ల వారు శీతల పానియాలు పిల్లలకు బుధవారం అందజేశారు. శిక్షణా తరగతుల్లో 45 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి నారాయణను కలిసిన ఆకుపాటి



పామూరు, మేజర్‌న్యూస్: మాజీ మంత్రి పొంగూరు నారాయణను టిడిపి యువ నాయకులు పట్టణ రెండవ ప్రాదేశిక ఎంపీటీసీ సభ్యులు డాక్టర్ ఆకుపాటి వెంకటేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం నెల్లూరులోని మాజీ మంత్రి క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి మొక్కను అందజేశారు. ఈ కార్యక్రమంలో షేక్ ఆఫ్రిద్, కటకం భాను, పసుపులేటి పవన్ కళ్యాణ్, గంధం వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు: సీఐ రామానాయక్

సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: ఎన్నికల ఫలితాల దృష్ట్యా ఎన్నికల నిబంధనలు అతిక్రమించి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని పామూరు సిఐ రామానాయక్ ఒకప్రకటనలో ప్రజలకు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు కౌంటింగ్ పూర్తయ్యేవరకు ఉంటున్నట్లు ఎవరైనా చట్టాన్ని వ్యతిరేకించి ప్రవర్తిస్తే కఠినచర్యలు తీసుకుంటామని సభలు సమావేశాలు నిర్వహించాలంటే తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని గ్రామాలలో రాజకీయ కక్ష్యలకు అవకాశం కల్పించేలా రెచ్చగొట్టే విధంగా వ్యవహరించరాదని వివాదాలకు తావులేకుండా సామరస్యంగా ఉండాలని మోటారు బైకులమీద చక్కర్లు కొట్టరాదని పెట్రోలు డీజిల్ నిల్వ ఉంచరాదని బహిరంగ ప్రదేశాల్లో మద్యం అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించరాదని సోషల్ మీడియాలో అసభ్యకరంగా రాజకీయ ప్రత్యర్థులను రెచ్చగొట్టే విధంగా పోస్టులు చేయరాదని అనుమానిత వ్యక్తుల సమాచారం ఇవ్వాలని ప్రతిఒక్కరు శాంతిభద్రతలకు సహకరించి ప్రశాంతంగా ఉండాలని చట్టాన్ని అతిక్రమిస్తే తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తున్నట్లు సిఐ రామానాయక్ ప్రకటనలో మండల ప్రజలకు తెలిపారు.

## ఓటర్లకు ధన్యవాదాలు

- **టీడీపీ కూటమి గెలుపు ఖాయం**
- **ఐ టీడీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ మార్నేని రామకృష్ణ**



పామూరు, మేజర్‌న్యూస్: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అత్యధికంగా ప్రజలు పోలింగ్‌లో పాల్గొని ఓటు వేసిన నియోజకవర్గ ప్రజలకు ఐ టీడీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ మార్నేని రామకృష్ణ ధన్యవాదాలు తెలిపారు. 13న జరిగిన ఎన్నికలలో కనిగిరి టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అఖండ మెజారిటీతో గెలవడం ఖాయం అన్నారు. జూన్ 4న వెలువడనున్న ఎన్నికల ఫలితాలలో అద్భుత ఫలితాలు రాబోతున్నాయి అన్నారు. గెలుపు కోసం అహర్నిశలు కష్టపడి పని చేసిన శ్రేణులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

# అమరావతి రాజధానిగా నిర్మాణం కోసం బాటలు వేద్దాం



బాపట్ల రూరల్, మేజర్‌న్యూస్: అందరం ఓట్లు వేశాము మంచి సమాజ నిర్మాణం కోసం బాటలు వేద్దాం అని ఊరురా జన విజ్ఞానం, ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక అధ్యక్షులు కోట వెంకటేశ్వర రెడ్డి అన్నారు. ఊరూరా జన విజ్ఞానం, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక, జన విజ్ఞాన వేదిక సాంస్కృతిక విభాగం, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బాపట్ల సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యాలయంలో సమీక్ష సమావేశం జరిగింది. ముందుగా ఈ సమీక్షా సమావేశానికి బాపట్ల జిల్లా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు జీవి బ్రహ్మం అధ్యక్ష వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కోట వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ 2024 ప్రస్తుత ఎన్నికలు అనుభవాలు అనంతర పరిణామాలు, గుణపాఠాలు భవిష్యత్తు భారతదేశం, ఆంధ్ర ప్రదేశ్ పునర్నిర్మాణం జరగాలన్నారు. ప్రజాస్వామ్యం ఎన్నికలు పంచ ప్రమాదాలు ఎన్నికల్లో అత్యంత దారుణంగా ఎన్నికల నైతికతను ప్రశ్నార్థకం చేశాయని ఈ సమావేశంలో పాల్గొన్న అందరూ ఆందోళన వ్యక్తం చేశారు. భారతదేశంలో ఎక్కడా లేనంతగా ప్రధాన పార్టీలు వందల కోట్ల డబ్బు ఖర్చు చేశాయి. ప్రజల్ని కులాలు పేర్లతో చీల్చివేశారు. కేంద్ర నాయకులు మతాల పేరుతో చీల్చి వేశారు. మద్యం మత్తుమందులు విపరీతంగా ప్రజలకు అలవాటు చేశారన్నారు. ఎన్నికల అనంతరం కొన్ని ప్రాంతాల్లో ఏపీలో హింస దౌర్జన్యాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఆయన అన్నారు. పోరం పర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పి సి సాయిబాబు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ఓటర్లు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. ప్రొఫెసర్. కే విజయ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర స్థాయిలో భారతదేశం ఎన్నికల పరిణామాలు గురించి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 83 % ఓట్లు పెరగటం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా అందరూ ఓట్లు వేశాము మంచి సమాజ నిర్మాణానికి బాటలు వేద్దాం అనే కరపత్రాలను ఆవిష్కరించటం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ బాపట్ల శాఖ అధ్యక్షులు కే శ్రీహరి రావు, ఆర్‌ఎన్ వర్మ , ఎస్ కె మునాఫ్,జీవి సుబ్రహ్మణ్యం,ఎం సూర్యనారాయణ గుప్తా , కే కాళిదాసు,డి భాస్కరరావు అబ్దుల్ మునాఫ్, ఎస్ కె సుభాని,లక్ష్మీ ప్రసాద్, కే సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ గుండి పార్వతీ అమ్మవారి ఉత్సవాలు



భట్టిప్రోలు,మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన భట్టిప్రోలు మహాప్రస్థానం లో వెలిసియున్న శ్రీ గుండి పార్వతి అమ్మవారి 10వ వార్షిక మహోత్సవాలు శ్రీ గుండి పార్వతి అమ్మవారి సేవాకాపు సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అనంతరం కుంకుమ పూజలు జరిపిన అనంతరం భక్తులు అమ్మవారికి మొక్కుబడులను తీర్చుకున్నారు.మధ్యాహ్నం 12 లకు పసుపు బండ్ల ఊరేగింపు పురవీధుల్లో నిర్వహించారు. అమ్మవారి ఘటం కుండతో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం అమ్మవారి ఆలయం నుండి శ్రీ హేమ విఠలేశ్వర స్వామి వారి వీధి,తంగిరాల వారి వీధి,సంకటివారి వీధి, బట్టు వారి రామమందిరం,ఆంధ్ర బ్యాంకు మీదుగా, రథం సెంటర్ నుండి చావలి బస్టాండ్ సెంటర్ మీదుగా కోవెలకు చేరింది.ఈ ఊరేగింపులో కాపు సంఘం యువత, పెద్దలు,అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకలో మధుసూదన్ రెడ్డి



బాపట్ల రూరల్, మేజర్‌న్యూస్: బాపట్ల మండలం అప్పాపురం గ్రామంలో జరిగిన వివాహ వేడుకలు లో పాల్గొని నూతన వధూవరులు నేహమయ్య సుప్రియ లకు శుభాకాంక్షలు తెలియజేశారు బాపట్ల నియోజకవర్గ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గాదె మధుసూధన రెడ్డి ఆయన వెంట గోవతోటి విజయ్, మారుబోయిన శ్రీనివాస్ రెడ్డి, డేగల రవి రెడ్డి, ప్రముఖ ఫాస్టర్ బుర్ర ఆంజనేయులు, గాదె యువసేన పాల్గొన్నారు.

## సంస్కృతి సంప్రదాయాలను ఆచరించాలి



కర్లపాలెం, మేజర్‌న్యూస్: హిందు ధర్మ సంస్కృతి సంప్రదాయాలను హిందువులందురు ఆచరించాలని ధార్మిక ఉపన్యాసకురాలు సి హెచ్ ఆనంతలక్ష్మి అన్నారు.తిరుమల తిరుపతి దేవస్థానము హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో కర్లపాలెం తెలగపాలెం శ్రీ కోదండ రామాలయంలో నాలుగు రోజుల పాటు మంగళవారం నుండి శుక్రవారం వరకు ధార్మిక కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి గుం టూరు జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ ఈ.అమ్మడు ,ఉపన్యాసకురాలు ఆనం తలక్ష్మిలు పాల్గొని ప్రసంగించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో ధార్మిక చైతన్యం కలగజేయడం కోసం ప్రజల్లో భక్తి భావాన్ని నెలకొల్పడం కోసం టీటీడీ గ్రామాల్లో ధార్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలియ జేశారు. ఈ నాలుగు రోజులు భజనలు ,ఉపన్యాసాలు , లక్ష్మీ అమ్మవారి కుంకుమ పూజలు ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పే నరసింహారావు ,ధర్మ ప్రచారక్ లు జంజనం హేమశంకరరావు ,అక్కల సుబ్బారెడ్డి స్థానిక భజన సమాజం వారు భక్తులు పాల్గొన్నారు.

## 27 నుండి జాతీయ స్థాయి శ్రీకారం రోటరీ కళాపరిషత్ నాటికల పోటీలు



మార్టూరు, మేజర్‌న్యూస్: శ్రీకారం రోటరీ కళా పరిషత్ 14వ జాతీయ స్థాయి నాటికల పోటీలు ఈ నెల 27, 28, 29 తేదిలలో మార్టూరులో జరుగుతాయని కళాప రిషత్ శ్రీకారం అధ్యక్షులు కందిమళ్ళ సాంబశివరావు అన్నారు. స్థానిక ఎఫర్ట్ కార్యాలయంలో బుధవారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ కళను ఆయు ధంగా చేసు టకొని సామాజిక ఇతివృత్తాలతో ప్రజలకు అవగా హన కలిగించి సామాజిక బాధ్యత పెంచాలనే లక్ష్యంతో గత 13 సంవత్సరాలుగా రాష్ట్రస్థాయి నాటికల పోటీల ను శ్రీకారం రోటరీ కళా పరిషత్ ద్వారా విజయ వంతంగా నిర్వహించామన్నారు. ఎఫెర్ట్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంస్థ జీవి మోహన్ రావు సభ అధ్యక్షులుగా వ్యవహరించనున్నారు. తొలిరోజు 27వ తేదీన రోటరీ 3150 గవర్నర్ బూసి రెడ్డి శంకర్ రెడ్డి ఈ పోటీలను ప్రారంభిస్తారని ముఖ్య అతిధిగా రిటైర్డ్ ఐఏఎస్ ఎన్టీఆర్ ట్రస్ట్ డాక్టర్ పి.కృష్ణయ్య, ఆత్మీయ అతిథి లక్ష్మణ రెడ్డి జన విజ్ఞాన వేదిక, గౌరవ అతిధిగా పూర్వ గవర్నర్ రోటరీ జిల్లా 3150 ఏఆర్ ప్రభాకర్, సన్మాన కర్తలు రోటరీ అధ్యక్షులు తాళ్లూరి సాంబశివరావు,మద్దుమాల కోటేశ్వరరావు కార్యదర్శి, వందన సమర్పణ కొర్రపాటి కాజారావు రోటరీ మాజీ అధ్యక్షులు పాల్గొంటారని పేర్కొన్నారు. 27న మొదటి నాటిక నాన్న నేను వచ్చేస్తా అమృత లహరి ఆర్ట్స్ విజయవాడ, తెలుగు కళా సమితి విశాఖ నిశ్శబ్దమా నీ ఖరీదు ఎంత, మూడవ నాటిక కళానికేతన్ వీరన్నపాలెం రాజు గారి గోచి, 28న శ్రీకా రం రోటరీ కళాపరిషత్ మార్టూరు రైతు భారతం, రస గురి పొన్నూరు కాపలా, కళాంజలి హైదరాబాద్ రైతే రాజు, మైత్రి కళానిలయం విజయవాడ బంధం, 29న అభినయ గుంటూరు ఇంద్రప్రస్థం, చైతన్య కళాభారతి కరీంనగర్ చీకటి పువ్వు, శ్రీ సాయి ఆర్ట్స్ కొలకలూరు కౌసల్య సుప్రజా రామ, వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ రాత నాటికలను ప్రదర్శించనున్నారు. ఈనాటికలలో ప్రదర్శిం చిన కళాకారులందరికి బహుమతులు అందజేస్తామని, గత 13 సంవత్సరాలుగా కళా పరిషత్ పోటీలను ప్రజలు విజయవంతం చేశారని, ప్రస్తుత పోటీలను కూడ విజయవంతం చేయాలని రోటరీ అధ్యక్షులు తాళ్లూరి సాంబశివరావు ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీకారం అధ్యక్షులు కందిమళ్ళ సాంబశివరావు, గవర్నర్ ఇంటూరి ఆంజనేయులు రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు అధ్యక్ష కార్యదర్శులు తాళ్లూ రి సాంబశివరావు, చెరు కూరి నాగేశ్వరరావు, మద్దుమాల కోటేశ్వరరావు, షేక్ కాజా హుస్సేన్, చెరుకూరి అంజిబాబు,మాజి అధ్యక్షు లు జాస్తి సాంబశివరావు, దొడ్డా రమేష్, అంకమ్మ చౌ దరి, సిహెచ్ బసవ రాములు, ఈశ్వర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



తిరుమలలో అఖిలాండ కోటి బ్రహ్మాండనాయక శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకొన్న ఎన్డీయే కూటమి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి

# జిల్లాకు చేరిన పార్లమెంట్ సర్వీస్ ఓట్లు 1185

ఒంగోలు, మేజర్‌న్యూస్: బుధవారం నాటికి జిల్లాకు పార్లమెంట్ సర్వీస్ ఓట్లు 1185 చేరాయి. ఒంగోలుకలెక్టరెట్ నందు గల జిల్లా పోస్టల్ ఓటింగ్ పార్లమెంట్ స్పెషల్ ఆఫీసర్ కె. ఝన్సీ లక్ష్మి ఛాంబర్‌లో పొలిటికల్ పార్టీల ప్రతినిధుల సమక్షంలో బుధవారం నాడు వచ్చిన 84ఒంగోలు పార్లమెంట్ సంబందించిన సర్వీస్ ఓట్లు, పోస్ట్ ఆఫీస్ రిజిస్టార్ పోస్ట్ ద్వారా వచ్చిన సర్వీస్ ఓట్లును రాజకీయ పార్టీల ప్రతినిధులకు చూపించి ఎన్ని వచ్చినయో లెక్కించి పోస్టల్ బ్యాలేట్ బాక్సులో వెయ్యటం జరిగింది. మొత్తం 6693 గాను 22 తేది బుధవారానికి 1185 ఓట్లు వచ్చాయి. ఒంగోలు అసెంబ్లీ మొత్తం సర్వీస్ ఓట్లు 143 మూడు గాను ఒంగోలు ఆర్డీవో ఆఫీస్‌కు ఈ రోజుకు 3 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఈ ప్రక్రియ జూన్ 4 తేది ఉదయం 8 వరకు రోజు వారిగా వచ్చిన సర్వీస్ ఓట్లను భద్రపారుస్తారు. ఒంగోలు నియోజకవర్గం పోస్టల్ బ్యాలేట్ ఓట్లు మొత్తం 4161అందుకు గాను మే4 నుండి 9వతేది వరకు జరిగిన పోలింగ్ లో 4090 ఓట్లు పోల్ అయ్యాయి. ఇతర జిల్లాలలో ఒంగోలు నియోజక వర్గనికి సంబందించిన పోలైన ఒంగోలుకు చేరిన ఓట్లు 681, ఒంగోలు సంబందించిన ఓట్లును ఒంగోలు ఆర్డీవో ఆఫీస్ స్ట్రాంగ్ రూంలో భద్రపరచారు. వైసీపీ నుండి దామరాజు క్రాంతికుమార్, జిల్లా వైకాపా ఎలక్షన్ రీప్రజెంటీటివ్, కాంగ్రెస్



రసూల్, బీజేపీ బసినేపల్లి రాజశేఖర్, రమణారెడ్డి, సూర్య, పాల్గొన్నారు.

# కౌంటింగ్ ఏర్పాట్లు వేగవంతం చేయాలి





## రైజ్‌లో స్ట్రాంగ్ రూములను తనిఖీ చేసిన కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు, మేజర్‌న్యూస్ : బుధవారం ఒంగోలు శివారులోని రైజ్ ఇంజినీరింగ్ కాలేజిని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏ.ఎస్ దినేష్ కుమార్ సందర్శించారు. ఇటీవల జరిగిన లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల ఈ.వి.ఎంలను ఇందులో భద్రపరచిన స్ట్రాంగ్ రూములను ఆయన తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూములకు వేసిన సీలును, భద్రత, సి.సి.టి.విల నిఘాను పరిశీలించారు. ఈ ప్రాంగణం మొత్తాన్నీ సి.సి. టి.వి పర్యవేక్షణలో ఉంచామన్నారు. గుర్తింపు కార్డు లేకుండా ఎవరినీ లోపలికి అనుమతించవద్దని భద్రతా సిబ్బందిని ఆదేశించారు. ఓట్ల లెక్కింపునకు అవసరమైన కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను కూడా ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నిర్దిష్ట గడువులోగా ఈ పనులు పూర్తయ్యేలా అవసరమైతే కూలీలను పెంచాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఒంగోలు అసెంబ్లీ రిటర్నింగ్ ఆఫీసర్ జి.వి.సుబ్బారెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు.

# అల్లర్లు సృష్టిస్తే కఠినచర్యలు : జిల్లా ఎస్పీ





మార్కాపురం, మేజర్‌న్యూస్: సార్వత్రిక ఎన్నికలు -2024 కౌంటింగ్ నేపథ్యంలో ఏవైనా అవాంఛనీయ సంఘటనలు, హింసాత్మక చర్యలు చోటు చేసుకున్నా.. అల్లరి మూకలు విధ్వంసానికి పాల్పడుతున్న సందర్భాల్లో సమయస్ఫూర్తితో స్పందించి, జన సమూహాలను నియంత్రించి శాంతిభద్రతలను పరిరక్షించటమే లక్ష్యంగా ప్రకాశం జిల్లా ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ ఐపియస్ ఆదేశాల మేరకు ఎఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు ఆధ్వర్యంలో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీస్ సిబ్బంది బుధవారం మార్కాపురం పట్టణంలోని గడియారం స్థంభం సెంటర్ వద్ద “మాబ్ ఆపరేషన్”మాక్ డ్రిల్ నిర్వహించారు. ముందుగా ఓ వైపు ప్లకార్డులు చేతపట్టిన ఆందోళనకారులు, అల్లరి మూకలు మరోవైపు వారిని ఎదుర్కొనేందుకు సిద్ధమైన పోలీసులు



జన సమూహాలను కంట్రోల్ చేయుటకు మొదటగా వార్నింగ్ ఇచ్చుట, అదివినకపోతే మెజిస్ట్రేట్ అనుమతితో భాష్ప వాయువు ప్రయోగించుట, లాఠీ చార్జ్ చేపట్టుట, ఆ తర్వాత ఫైర్ డిపార్ట్మెంట్ వారితో వాటర్ కెనాన్ వారిపై ప్రయోగించుట, ప్లాస్టిక్ పెల్లెట్స్ ఫైరింగ్, అప్పటికి పరిస్థితి అదుపులోకి రాకపోతే ఫైరింగ్ చేయుట వంటివి డెమో ద్వారా అత్యంత పరిపక్వతతో ప్రదర్శించారు. జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తూ విధ్వంసానికి ప్రయత్నించే అల్లరిమూకలను అణచి వేసేందుకు, జన సమూహాలను నిలువరించుటకు, అత్యవసర సమయంలో పరిస్థితిని అదుపులోకి తీసుకొని వచ్చేలా ప్రత్యేక టీమ్స్ ఏర్పాటు చేయడం జరిగింది. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా అల్లర్లు గొడవలు సృష్టించే వ్యక్తుల పట్ల చట్టప్రకారం చర్యలు తీసుకోవటం జరుగుతుందని పోలీసులు హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో మార్కాపురం డిఎస్పీ బాలసుందరం, మార్కాపురం సీఐ వెంకటేశ్వర్లు, మార్కాపురం టౌన్ ఎస్సై అబ్దుల్ రెహమాన్, రూరల్ ఎస్సై వేంకటేశ్వరనాయక్, ఆర్.ఎస్.ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

# సఖి సెంటర్‌ను సందర్శించిన బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు



ఒంగోలు, మేజర్‌న్యూస్: ఏపి బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి బుధవారం ఒంగోలు రిమ్స్ ప్రాంగణంలోని నిర్వహించబడుతున్న మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రకాశం జిల్లా వారి సఖి, వన్ స్టాప్ సెంటర్ నందు తాత్కాలికంగా ఆశ్రమం పొందుతున్న లైంగిక దాడికి గురైన బాలికను పరామర్శించారు. సఖి సెంటర్ ద్వారా అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. బాధిత బాలికకు సత్వర న్యాయం జరిగేలా చూడాలన్నారు. రిమ్స్‌లో వైద్య సహాయం పొందుతున్న టీనేజీ ప్రగ్నెంట్ బాలికలకు, బాల్య వివాహాలు జరిగి గైనిక్ డిపార్ట్‌మెంట్ ప్రసరించిన బాలికలకు పరామర్శించారు.

ఈ కార్యక్రమంలో ఏపిఎస్‌సిపి డిసీఆర్ సభ్యురాలు బి. పద్మావతితో పాటు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, ప్రాజెక్టు డైరెక్టర్ కె.మాధురి, ఒంగోలు అర్బన్ సిడిపివో ఫిరాజకుమారి, సిడబ్ల్యుసీ సభ్యురాలు డి.వంశీలత, సఖిసెంటర్ అడ్మినిస్ట్రేటర్ ఎన్. జ్యోతి సుప్రియ, రిమ్స్ సూపరింటెండెంట్ దుర్గా భవానీ, ఆర్ఎంవో, డిహెచ్‌వో సురేష్, డిసిపివో పి.దినేష్‌కుమార్, సుపర్‌వైజర్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆరోగ్యశ్రీ పథకం నిలిపివేత అవాస్తవం

## యథావిధిగా వైద్య సేవలు కొనసాగింపు

## ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ జిల్లా సమన్వయకర్త డా. పి.హేమంత్

ఒంగోలు, మేజర్‌న్యూస్: ఈనెల 21వ తేదీ నుండి ఆరోగ్యశ్రీ పథకం నిలిపివేత అని సోషల్ మీడియా, కొన్ని ప్రముఖ పత్రికలలో వస్తున్న కథనాలు పూర్తిగా అవాస్తవమని ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ప్రకాశం జిల్లా సమన్వయకర్త డా. పి. హేమంత్ తెలియజేశారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 40 ఆరోగ్యశ్రీ ప్రైవేట్ నెట్వర్క్ హాస్పిటల్స్లో బుధవారం రోజున దాదాపుగా 1500 అవుట్ పేషెంట్, 200 పైగా ఇన్ పేషెంట్ అడ్మిషన్స్ ఆరోగ్యశ్రీ పథకంలో జరిగాయి.

ప్రకాశం జిల్లాలో సేవలు యధాతథంగా కొనసాగుతున్నాయి అనటానికి ఇదే నిదర్శనం అన్నారు. కాబట్టి జిల్లా ప్రజలందరూ ఆరోగ్యశ్రీకి సంబందించిన అవాస్తవ ప్రచారాలను, కథనాలను నమ్మొద్దని విజ్ఞప్తి చేస్తున్నాను. ప్రజలందరూ యధాతథంగా ఎమర్జెన్సీ, నాన్ ఎమర్జెన్సీ సేవలను ఆరోగ్యశ్రీ పథకం ద్వారా యధాతథంగా ఉచితంగా పొందవచ్చని తెలిపారు.